నవాబుపేట, మే 30 : మండల పరిధిలోని పులుమామిడిలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శి బందయ్య చర్యలు తీసుకుంటున్నా రు. ఈ సమస్యలపై వార్డు ప్రజలు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఆయన జేసీబీ సా యంతో పనులు చేయిస్తున్నారు. ఆయన వెంట పారిశుధ్య కార్మికులు గోపాల్, ఏసు, శ్రీనివాస్ ఉన్నారు.

పాఠశాలల్లో మరమ్మతులు ప్రారంభం

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందించిన కలెక్టర్
- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు, విద్యార్థులు

తింసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన మండల పంచాయతీ అధికారులు

పెద్దేముల్, మే 30 : మండల పరిధిలోని ఆయా పాఠశాలల్లో మరమ్మతులు ప్రారంభమయ్యాయి. 'మూడు పాఠశాలల్లో ప్రారంభం కాని పనులు' అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో వచ్చిన కథనానికి మండల పరిషత్ అధికారులు స్పందించారు. మండల పరిధిలోని ఆయా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న బడుల మరమ్మతుల పురోగతిపై ఈ నెల 28న మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి జ్యోతీపద్మ ఆయా పాఠశాలల హెచ్ఎంలు, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఇందూరు, తింసాన్‌పల్లి, తట్టేపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ఎలాంటి పనులు ప్రారంభం కాలేదనే విషయం బయటపడింది. ఇదే విషయమై నమస్తే తెలంగాణలో కథనం వచ్చింది. ఈ విషయంకలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి అధికారులను వివరణ కోరారు. దీంతో ఆయా పాఠశాలల్లో హడావుడిగా మరమ్మతులను ప్రారంభించారు. ఎంపీడీవో జర్నప్ప ఆయా పాఠశాలల్లో ప్రారంభించిన పనుల వివరాలు తెలుసుకున్నారు. పీఆర్ ఏఈ సిద్ధార్థ, పంచాయతీ కార్యదర్శులతో ఫోన్‌లో మాట్లాడి పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. తింసాన్‌పల్లి పాఠశాలను ఏఈ సందర్శించి పంచాయతీ కార్యదర్శి సంగీతతో కలిసి రూ.లక్షతో మంజూరైన తాగునీటి సౌకర్యం పనుల్లో భాగంగా వాటర్ పైప్‌లైన్ వేయించి, 500 లీటర్ల వాటర్ ట్యాంకును ఏర్పాటు చేయించారు. టాయిలెట్ తదితర మరమ్మతులు చేయిస్తున్నారు. తట్టేపల్లిలో వాటర్ ట్యాంకును ఏర్పాటు చేయించడంతో పాటు మూత్రశాలల పనులు కొనసాగుతున్నాయి. ఇందూరులో మరమ్మతులకు సంబంధించి మెటీరియల్‌ను కొనుగోలు చేసి పనులు ప్రారంభించారు. ఆయా పాఠశాలల్లో పనులు ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు, పాఠశాలల హెచ్ఎంలు హర్షం వ్యక్తం చేశారు.

'బడిబాట'ను విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో హరిశ్చందర్

పరిగి, మే 30 : జూన్ 3 నుండి 19వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిగి ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి, ఎంఈవో హరిశ్చందర్ అన్నారు. గురువారం పరిగి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో ఆధ్వర్యంలో గ్రామాల ప్రత్యేక అధికారులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులకు బడిబాట కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 3 నుండి 19వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఉపాధ్యాయులు, అధికారులు గ్రామాల్లో డ్రాపౌట్ విద్యార్థులను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పనులను జూన్ 3వరకు పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు పనులు పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచించారు, అకాడమిక్ సంబంధించిన పుస్తకాలు, యూనిఫామ్స్ సంబంధించి జూన్ 5న పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

ఈఎల్స్ మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయుల విజ్ఞప్తి

హెచ్ఎంలు సమ్మర్ వెకేషన్‌లో కూడా పనిచేస్తున్నందున తమకు ఈఎల్స్ మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంపీడీవోకు, ఎంఈవో కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, అర్బన్ ప్రత్యేక అధికారి దీప్తిరెడ్డి, రూరల్ ప్రత్యేక అధికారి వేణుగోపాల్, నోడల్ అధికారి గోపాల్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త

- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- కొనుగోళ్లపై ప్రత్యేక రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలి

కొడంగల్: సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శంకర్ రాథోడ్

కొడంగల్, మే 30 : నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ శంకర్ రాథోడ్ సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఫర్టిలైజర్ డీలర్లు, ఏవో, ఏఈవోలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజన్ ప్రారంభం కావడంతో నకిలీ విత్తనాల బెడద అధికంగా ఉంటుందని, వీటిపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి వారి బారి నుంచి కాపాడుకుందామన్నారు. డీలర్లు రైతుల పట్ల అంకిత భావంతో విక్రయిస్తే నకిలీ విత్తనాల మహమ్మారి అంతరిస్తుందన్నారు. అక్రమార్జన కోసం కొందరు వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. దీంతో నకిలీ విత్తనాలు విత్తితే కలుపు నివారణతో పాటు దిగుబడి తగ్గి పూర్తిస్థాయిలో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాలపై దృష్టి సారించి వ్యవసాయ అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే ఈ ఏడాది నుంచి విత్తన విక్రయాలకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. ఈ రిజిస్టర్‌లో విత్తనాలను కొనుగోలు చేసే రైతులతో పాటు పూర్తి వివరాలను పొందుపర్చాల్సి ఉంటుందని తెలిపారు. లేనిపక్షంలో చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నకిలీ విత్తనాలను రూపుమాపే దిశగా ఏవో, ఏఈవోలు గ్రామాల్లో పర్యటించి తనిఖీలు నిర్వహించాలని ఏడీఏ ఆదేశించారు. డీలర్ల వద్ద ఈ ఏడాది నుంచి చేపట్టే ప్రత్యేక రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని, ప్రతి డీలర్ రిజిస్టర్‌ను అనుసరించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై భరత్‌రెడ్డితో పాటు వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

బషీరాబాద్: రైతులు విత్తనాలు కొనే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తాండూరు ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. గురువారం మండలంలోని జీవన్గి, కంసాన్‌పల్లి, కోత్లా పూర్, దామర్‌చేడ్ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ తక్కువ ధరకు వస్తాయని నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని సూచించారు. విత్తనాలు కొన్న తరువాత పంట పూర్తి అయ్యే వరకు రసీదును జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. రసీదు ఉంటే కొనుగోలు చేసిన విత్తనాలు మొలకెత్తకపోతే, పంట నష్టం జరిగితే చాలా ఉపయోపడుతుందన్నారు. అలాగే విత్తనాలు విత్తే సమయం లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచి వర్షాలు కురి సిన తరువాతనే విత్తనాలు పెట్టుకోవడం మంచిదన్నారు. అనం తరం మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాలు, మం దుల దుకాణంలో తనిఖీలు చేశారు.

యాలాల: అధిక దిగుబడికి నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని

ధారూరు: అవగాహన కల్పిస్తున్న అధికారి మంజుల

యాలాల మండలంలోని దేవనూరులో..

మండల వ్యవసాయ అధికారి యాదగిరి రైతులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని దేవనూరులో విత్తన కొనుగోళ్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలర్లు, దుకాణాల యజమానుల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాలు విత్తిన తర్వాత ప్యాకెట్లను భద్రపరుచుకోవాలన్నారు. ఎవరైనా లూజు విత్తనాలను విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. జనుము 40 కిలోల బస్తా రూ.3,620 కాగా రాయితీపై రూ.1,448, జీలుగ 30 కిలోల బస్తా రూ.2,790 కాగా రాయితీపై రూ.1,116 లకు అందిస్తున్నామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు శుక్రవారంలోపు ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకొని ఏఈవోల అనుమతి పొంది సొసైటీలో తీసుకోవాలన్నారు.

ధారూరు: రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి మంజుల సూచించారు. గురువారం మండల పరిధిలోని ఉపాధి హామీ పథకం కూలీలు, రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. రైతులు తప్పకుండా వ్యవసాయ శాఖ అధికారుల సలహా, సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు, రైతులు ఉన్నారు

బడిబాటపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి గోపాల్

నవాబుపేట, మే 30 : అమ్మ ఆదర్శ పాఠశాలలు, బడిబాట కార్యక్రమాలపై మండల పరిధిలోని రైతు వేదికలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఏ పనులు పూర్తయ్యాయి, బడిబాట కార్యక్రమాలను ఎలా నిర్వహించాలనే అంశాలపై హెచ్ఎంలతో చర్చించారు. ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్న బడిబాట షెడ్యూల్‌పై పలు సలహాలు ఇచ్చారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అజయ్ కుమార్, ఎంఈవో గోపాల్, ఏవో ప్రసన్న లక్ష్మి, ఏపీఎం మంజులవాణి, మండల నోడల్ ఆఫీసర్ అబ్దుల్ రెహమాన్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

బడిబాట పై నేడు సమావేశం

పెద్దేముల్, మే 30 : జూన్ 3 నుంచి 11 వరకు కొనసాగనున్న బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జర్నప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి జ్యోతీ పద్మ హాజరు కానున్నారు. సమావేశానికి ఆయా పాఠశాలల హెచ్ఎంలు,ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, సీఆర్పీలు, ఐసీడీయస్ సూపర్ వైజర్లు హాజరై విజయవంతం చేయాలని జర్నప్ప కోరారు.

బడికిరాని పిల్లలను గుర్తించాలి

తాండూరు రూరల్, మే 30: బడీడు పిల్లందరూ బడుల్లో ఉండేలా కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని తాండూరు మండల ప్రత్యేకాధికారి సత్తార్ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో హెచ్ఎం, పంచాయతీ కార్యదర్శులతోపాటు పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ బడులతోపాటు ప్రైవేట్ బడులకు వెళుతున్న వారి సంఖ్య నమోదు చేసుకోవాలని తెలిపారు. బడికి రాని పిల్లలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్ తదితరులు ఉన్నారు.

దోమ, మే 30 : మండల పరిధిలోని కిష్టాపూర్‌లో మల్లికార్జునస్వామి మహత్యం వీధి నాటకాన్ని బుధవారం రాత్రిప్రదర్శించారు. కళాకారుల ఆహ్వానం మేరకు జడ్పీటీసీ నాగిరెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి నాటకాన్ని తిలకించారు. ఈ సందర్భంగా కళాకారులకు రూ.10వేలు అందజేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, యువ నాయకులు కృష్ణారెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, శశి, నర్సింహులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు

మృతదేహం లభ్యం

యాలాల, మే 30 : తాండూరు పట్టణంలోని నిజాం షాహీ దర్గా సమీపంలోని బావిలో గురువారం ఉదయం మృతదేహాన్ని గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. పట్టణంలోని సీతారాంపేటకు చెందిన తట్టేపల్లి వెంకటేశ్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

దోమ, మే 30 : మండల పరిధిలోని మోత్కూర్‌కు చెందిన ఎడ్ల బుగ్గయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి తన అనుచరుల ద్వారా రూ.5వేల నగదును మృతుడి కుమారుడికి అందజేశారు.

పూడూరు,మే 30 : శుక్రవారం పదవీ విరమణ పొంద నున్న మండల ప్రత్యేకాధికారి, మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా ఉన్నతాధికారి సుధారాణిని పూడూరు మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయులు, ఎంపీడీవో సిబ్బంది గురువారం వేర్వేరుగా సన్మానించారు. గతంలో పూడూరు మండల ఎంపీడీవోగా ఐదు సంవత్సరాలు ఆమె పని చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పాండు, ఎంఈవో హరిచంద్ర వీరితో పాటు ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు వరలక్ష్మి, శ్రీనివాస్, అంజిలయ్య, జహంగీర్, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహులు, పంచాయతీ కార్యదర్శులు మాణిక్యం, మల్లేశం, జహంగీర్, అగమయ్య ఉన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన ఉండాలి

అవగాహన కల్పిస్తున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ బలరాం

ధారూరు, మే 30 : మహిళా సాధికారత ఆవశ్యకతపై అవగాహన ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ బలరాం తెలిపారు. గురువారం మండల పరిధిలోని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు, మహిళా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమాజంలో స్త్రీ పాత్ర, 2006 బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో చట్టం, లైంగిక దాడులు, లింగ వివక్ష, గృహ హింస వరకట్న నిషేధం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ వరలక్ష్మి, బాబు పాల్గొన్నారు.

వాహనాలకు నంబరు ప్లేటు ఉండాలి

ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

బొంరాస్‌పేట, మే 30 : ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలకు తప్పక నంబరు ప్లేటు బిగించుకుని వాహనాలను నడపాలని కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని తుంకిమెట్ల గ్రామంలో నెంబరు ప్లేట్లు లేని వాహనాల డ్రైవ్ నిర్వహించి నంబరు ప్లేట్లు లేని పదిహేను ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఇక ముందు వాహనదారులందరు నంబరు ప్లేటు లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై అబ్దుల్ రవూఫ్, ఎఎస్సై కమాల్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కులకచర్ల, మే 30 : చౌడాపూర్ మండలం లిగంపల్లి గ్రామ సమీపంలో ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసునమోదు చేసినట్లు కులకచర్ల ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

బొంరాస్‌పేట: సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాంరెడ్డి

కులకచర్లలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణనాయక్

బొంరాస్‌పేట, మే 30 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని బొంరాస్‌పేట, దుద్యాల మండలాల ప్రత్యేక అధికారులు రాంరెడ్డి, మోజస్, ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల చైర్‌పర్సన్లు, హెచ్ఎంలతో నిర్వహించిన సమా వేశంలో వారు మాట్లాడారు. వచ్చే నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న దృష్ట్యా పాఠశాలల్లో మౌలిక వసతులు పూర్తి కావాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈవో రాంరెడ్డి మాట్లా డుతూ వచ్చే నెల 3వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమాన్ని అన్ని పాఠ శాలల్లో నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరే విధంగా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని కోరారు. రోజువారి కార్యక్రమాలను పడక్బందీగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎం హరిలాల్, చౌదర్‌పల్లి, దుద్యాల ఉన్నత పాఠశాల హెచ్ఎంలు శ్రీహరిరెడ్డి, నెహ్రూచౌహాన్, హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కులకచర్ల: ప్రతి పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు ఈ నెల 31లోపు పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి సరళాదేవి, చౌడాపూర్ ప్రత్యేక అధికారి ఉపేందర్, కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, మండల స్థాయి అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను శుక్రవారం వరకు పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం హెచ్ఎంలు, చైర్‌పర్సన్‌లు చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులను పూర్తి చేసి అందజేయాలన్నారు. ఈ నెల 3 నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభమవుతుందని హెచ్ఎంలు సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో కరీమ్, ఎంఈవో అబీబ్‌హైమద్, ఏపీఎం శోభ, హెచ్ఎంలు, సీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు...

వికారాబాద్ బీజేఆర్ చౌరస్తాలో సాంకేతిక లోపంతో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

వికారాబాద్, మే 30 : ఆర్టీసీ బస్సులు మొరాయిస్తున్నాయి. వికారాబాద్ ఆర్టీసీ డిపోలో 64 బస్సులు ఉన్నాయి. వీటిలో కాలం చెల్లిన బస్సులను నడుపడంతో మరమ్మతులకు వస్తున్నాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో వారు అధిక సంఖ్యలో బస్సులను ఆశ్రయిస్తున్నారు. ప్రయాణికులను ఎక్కించుకొని బయలుదేరిన బస్సులు సాంకేతిక లోపం, బ్రేకులు ఫెయిల్ అయి ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా కంకర రోడ్లు, ఘాట్ రోడ్డు, ప్రధాన చౌరస్తాల్లో బస్సులు ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు పలు అవస్థలు పడుతున్నారు.

గురువారం వికారాబాద్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా బీజేఆర్ వద్ద శంకర్‌పల్లి వెళ్లే బస్సు సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. దీంతో తాండూరు, హైదరాబాద్ వచ్చి, వెళ్లే బస్సులు సైతం ఆ చౌరస్తా నుంచి వెళ్లాల్సి వస్తుంది. బస్సు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వికారాబాద్ ఆర్టీసీ బస్ డిపోకు సమాచారం అందించడంతో మెకానిక్ వచ్చి రిపేర్ చేశారు.

ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహన దారులకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలం చెల్లిన బస్సులను తొలగించి కొత్త బస్సులను వేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తరలించడంలో పలు ఇబ్బందులు పడ్డారు.